క్లుప్తంగా

అశోకుడి శిలాశాసనాలను సందర్శించిన డీఐజీ

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరి సమీపంలోని ఆశోకుడి శిలాశాసనాలను శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్ సెంథిల్‌కుమార్ సందర్శించా రు.తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పెద్ద బండరాయిపై ఆశోకుడు చెక్కించిన శాసనాలను తిలకించారు. డీఐజీ వెంట ఎస్‌ఐ రామాంజినేయులు శాసనాల సంరక్షకుడు బాబు ఉన్నారు.

సమస్యలపై వినతి

పత్తికొండ రూరల్ : సర్పంచుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సర్పంచుల సంఘం నియోజకవర్గ ప్రతినిధి ముజుబుర్ రహిమాన్ కోరారు. శనివారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగిన సర్పంచుల సమావేశంలో ఆయన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ముత్యాలనాయుడు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషను మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి



ఆస్పరి ఆర్‌బీకే కేంద్రంలో రైతుల ఈకేవైసీని పరిశీలిస్తున్న ఆలూరు ఏడీఏ సునీత

ఆస్పరి: రబీ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత అన్నారు. శనివారం మండలంలోని ఆస్పరి, జొహరాపురం, చిన్నహోతూరు గ్రామాల్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో ఈకేవైసీ నమోదును ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ నమోదు చాలా తక్కువగా ఉందన్నారు. రబీ సీజన్‌లో 4461 మంది రైతులు పప్పు శనగ పంట వేయగా ఇప్పటి వరకు 520 మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు సైతం ఈనెల 6వ తేదీలోపు వలంటీర్ల, వీపీఏలు ద్వారా చేయించుకోవాలన్నారు. ఏడీఏ వెంట ఏఓ మునెమ్మ ఉన్నారు.

పంట పొలాలు పరిశీలన

మద్దికెర : రైతులు విత్తనం వేసేటప్పుడు తప్పనిసరిగా విత్తనశుద్ధి పాటు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలని ఏఓ హేమలత అన్నారు. శనివారం మద్దికెర పరిసరాల్లో వ్యవసాయ తోటలలో సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇష్టానుసారంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేయవద్దన్నారు. దీనివల్ల భూమి సారం కోల్పోయి దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే పంటలు సాగు చేసిన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పేదలకు వరం వైఎస్సార్ బీమా



బాధిత కుటుంబసభ్యులకు సాయం అందిస్తున్న అధికారులు

కృష్ణగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైఎస్సార్ బీమా పథకం ఓ వరం లాంటిదని సూపరింటెండెంట్ రామస్వామి, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్ అన్నారు. మండల కేంద్రం కృష్ణగిరిలో నాలుగు రోజుల క్రితం ఆనారోగ్యంతో మృతి చెందిన షేక్ ఖాజా బీ కుటుంబ సభ్యులకు శనివారం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు, ఆనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు. అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



క్యాన్సర్ వ్యాధి లక్షణాలు వివరిస్తున్న వైద్యులు

మద్దికెర : క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండి ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రం మద్దికెరలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనబడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే రొమ్ము క్యాన్సర్ గుర్తించవచ్చన్నారు. ఒకసారి వాడిన నూనెలను మళ్లీమళ్లీ వాడడం, గుట్కా, పాన్‌మసాలా, పొగతాగడం, తదితర వాటిని తీసుకోవడం వల్ల శరీరంలో ఏ భాగానికైనా క్యాన్సర్ రావడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే, సరైన చికిత్స ద్వారా ఈ వ్యాధిని జయించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపు
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు శిక్షణ
- పార్టీ విజయానికి సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి





మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, శిక్షణ కార్యక్రమానికి హాజరైన వైఎస్‌ఆర్‌సీపీ సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లు

ఎమ్మిగనూరు టౌన్: ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి కూడా సీఎంగా చేసుకుందామని పార్టీ శ్రేణులకు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మిగనూరు మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో నందవరం మండలానికి సంబంధించిన వైఎస్‌ఆర్‌సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. పార్టీ నిబంధనల మేరకు గృహసారథులు పనిచేయాల్సి ఉంటుందని సూచించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ మండలాల ఇన్‌చార్జ్‌లు ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వారికి వివరించాలన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లాలన్నారు. గృహ యజమానుల అనుమతితో 'మా నమ్మకమే నువ్వు జగనన్న' అనే స్టిక్కర్లకు ఇళ్లకు అతికించాలన్నారు. అలాగే వారికి సంబంధించి ఏవైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. మూడున్నరేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, కార్మికులు ఇలా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు చేశారన్నారు. ఈ విషయాలన్నీ గడపగడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీశ్రేణులపై ఉందన్నారు. ఇందు కోసం ప్రతి సచివాలయానికి ముగ్గురు వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్లు, 50 ఇళ్లకు ఇద్దరు గృహసారథులను ఎంపిక చేశామన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, ఎంపీపీ కేశన్న, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్ కుమార్, నందవరం మండల నాయకులు కనకవీడు లక్ష్మీకాంతరెడ్డి, శివప్పగౌడ్, విరూపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, ఎంకే శివప్రసాద్, జేసీఎస్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.1 కోటితో బీటీ రోడ్డు నిర్మాణం

సరైన రహదారి లేక మిలటరీ, వెంకటాపురం కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడి ఆయా కాలనీలకు బీటీ రోడ్డు ఏర్పాటుకు పూనుకున్నారు. రూ.1 కోటితో చేపట్టే ఈ పనులకు శనివారం ఆయన శిల్పాఎస్టేట్ సమీపంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు కౌన్సిలర్లు రజిత, బజారి, మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు ప్రతాప్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

ఎమ్మిగనూరు టౌన్: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి దాదాపు రెండు లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతోందన్నారు. పట్టణంలోని సిడాప్, డీఆర్‌డీఏ ట్రెనింగ్ సెంటర్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన ప్రముఖ కంపెనీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ పనితీరు మెరుగుపరుచుకుంటూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కాగా మెగా జాబ్‌మేళాకు 13 ప్రముఖ కంపెనీలు రాగా 465 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వారిలో 218 మందిని ఆయా కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు,వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి సోమేశ్వరరెడ్డి, సీడాప్, డీఆర్‌డీఏ జిల్లా మేనేజర్ కిరణ్, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కేశన్న, కౌన్సిలర్ శివప్రసాద్, ఏరియా కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో నిరుద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

నేటి సమాచారం

చెన్నకేశవస్వామి రథోత్సవం

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్ట్ మలలో ఆదివారం శ్రీకొలుట్ల చెన్నకేశవస్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు జరిగే రథోత్సవానికి మంత్రి గుమ్మ నూరు జయరాం, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, శ్రీదేవి హాజరు కానున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి తెలిపారు.

దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: బిల్లేకల్లు గ్రామంలో వెలసిన దస్తగిరిస్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ఈనెల 6వ తేదీ నుంచి గ్రామంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య శనివారం తెలిపారు. వివరాలకు సెల్ నంబర్: 9182897750 ను సంప్రదించాలన్నారు.

గృహసారథుల సమావేశం

ఆలూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం హాలహర్వి, హొళగుంద మండలాలకు చెందిన గృహరథసారథుల సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ వీరేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠ

వెల్దుర్తి: కృష్ణాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం సుంకులమ్మ, మారెమ్మ దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భజన, అన్నదానం కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

కుష్టు నిర్మూలనకు తోడ్పడండి

గోనెగండ్ల: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ చంద్రయ్యశెట్టి అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో కుష్టుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రంగ రవళి, ఎంపీహెచ్‌ఎస్ పరమేష్, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.



కుష్టువ్యాధిపై అవగాహన కల్పించే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

కుష్టుకు మెరుగైన చికిత్స

వెల్దుర్తి: కుష్టు వ్యాధికి మెరుగైన చికిత్స ఉందని, త్వరగా నయం చేసుకోవచ్చునని కుష్టు నివారణ సంస్థ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్‌ఈఓ) శివశంకర్, డిప్యూటీ హెచ్‌ఈఓ దేవప్రసాద్ అన్నారు. శనివారం వారు స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులంలో కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురుకులం ప్రిన్స్‌పాల్ లక్ష్మీ ప్రసూన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వరకు జాతిపిత సేవలను గుర్తు చేసుకుంటూ కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కుష్టుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స లభిస్తోందన్నారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులం వైస్ ప్రిన్స్‌పాల్ నిర్మల, హెల్త్ సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తిశ్రద్ధలతో ఉరుసు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లులో దస్తగిరిస్వామి, నగరూరులో బడేసాహెబ్ ఉరుసును ఘనంగా నిర్వహించారు. భక్తులు దర్గాల్లో స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు చేసి కానుకలు సమర్పించారు. దస్తగిరి స్వామి, బడే సాహెబ్ స్వామి అశ్వాలను గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

నందవరం: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, సంజీవపురం గ్రామాల్లోని ఎంపీపీ, ఎంపీయూపీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం చదువులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తుందన్నారు. తమ వంతు కృషిగా ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభ పద్ధతిలో విద్య బోధన చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. అలాగే పాఠశాలలో నాడు- నేడు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అయ్యన్నకు నివాళి

పత్తికొండ రూరల్ : పందికోన గ్రామంలో కామ్రేడ్ అయ్యన్న వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ పార్టీ నేతలు ఆయన స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పందికోనలో దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా అయ్యన్న రాజీలేని పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు నబీరసూల్ పాల్గొన్నారు.

14 నుంచి సుంకులమ్మ ఆలయ ప్రారంభ వేడుకలు

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రా మంలో ఈనెల 14నుంచి మూడు రోజుల పాటు సుంకులమ్మ దేవాలయం ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.14 న గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయం ప్రారంభోత్సవం, కలశ ప్రతిష్ఠ, 15 న సుంకులమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్ఠ, 16 న ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఆలూరు: నియోజకవర్గ కేంద్రం ఆలూరు సిద్ధేశ్వర స్వామి కాలనీలోని పేదలకు శనివారం సీపీఐ నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబీరసూల్ ఆధ్వర్యంలో రెన్యూ సంస్థ ప్రతినిధులు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులు, ఉదయ్, సీపీఐ నాయకు లు భూపేష్,మద్దిలేటిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అన్న మృతి కేసులో తమ్ముడి అరెస్ట్

క్రైమ్ కార్నర్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో రెండు రోజుల క్రితం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన నరసింహారెడ్డి(68) కేసులో తమ్ముడు సుధాకర్ రెడ్డిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కె. మోహన్‌రెడ్డి శనివారం ఎస్ఐ సునీల్‌కుమార్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(68), తమ్ముడు సుధాకర్‌రెడ్డి చిన్న మాటపై గొడవ పడ్డారు. ఈ క్రమంలో సుధాకర్‌రెడ్డి తన అన్నను బలంగా కిందికి తోయటంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కుమారుడు రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా తమ్ముడు తోసినందుకే కిందపడి మృతి చెందినట్లు విచారణలో బయటపడిందని సీఐ చెప్పారు. ఉదయం కె.తిమ్మాపురం గ్రామ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

చోరీ ఘటనపై విచారణ

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీ, ఎంజీ పెట్రోల్ బంక్ సమీపంలో రెండు ఇళ్లలో జరిగిన చోరీలపై క్లూస్ టీం పోలీసులు శనివారం వేలి ముద్రలను సేకరించారు. ఉపాధ్యాయుడు షేక్‌మహబుబ్‌బాషా, శివప్రసాద్ అనే మరో వ్యక్తి ఇళ్లలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయుడు ఇంట్లో 20 తులాల బంగారం, శివప్రసాద్ ఇంట్లో అర తులం బంగారం దొంగతనం జరిగింది. రెండు ఇళ్లలకు వెళ్లిన క్లూస్ టీం పోలీసులు బీరువా, తలుపులతో పాటు, ఇంట్లో వారి వేలిముద్రలు కూడా సేకరించారు. వీరి వెంట పట్టణ ఏఎస్ఐ విజయ రాజు, పోలీసులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హొళగుంద: నెరణికి గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి ఇంట్లో 7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సదరు వ్యక్తి ఆంధ్ర నుంచి అక్రమంగా కర్ణాటకకు తరలించేందుకు భారీగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసుకున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో తాము దాడి చేసి ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ శనివారం విలేకరులకు తెలిపారు.

ఉపాధిలో అవినీతికి పాల్పడితే చర్యలు

- డ్వామా ఏపీడీ సలీంబాషా
- సామాజిక తనిఖీలో రూ.66,874 రికవరీ

నందవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా ఏపీడీ సలీంబాషా హెచ్చరించారు. ఉపాధి పనులపై శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 15 గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం 2021- 2022 సంవత్సరానికి సంబంధించి 492 పనులకు గానూ రూ. 5.93 కోట్ల నిధులు వెచ్చించామన్నారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి పనులను గుర్తించి సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు. ఆయా పనులకు సంబంధించి పని ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, డగౌట్, ఫారంపాండ్‌లకు వర్క్‌ఫైల్ నమోదు చేయకపోవడం తదితర పనుల్లో జరిగిన అవినీతి కారణంగా రూ. 64,374 రికవరీ, రూ.2,500 పెనాల్టీ విధించి రికవరీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డివిజన్ విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, ఏపీడీ అలిపీర, ఎంపీడీఓ కృష్ణమూర్తి, డీఆర్‌డీఓ ఏఓ షరీఫ్, క్వాలిటీ కంట్రోల్ అధికారి గోవర్ధన్, ఎస్‌ఆర్పీ సీఎస్ఆర్ మూర్తి, పీఆర్ ఏఈ జయన్న, ఏపీఓ మాలిక్‌బాషా, జెడ్పీటీసీ నిఖిల్‌చక్రవర్తి, ఈసీ నూర్జహాన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ సలీంబాషా

మిట్టసోమపురం ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

మండల పరిధిలోని మిట్టసోమపురం ఫీల్డ్ అసిస్టెంట్ బోయ వీరస్వామి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయనను విధుల నుంచి తొలగించాలని గ్రామస్తులు నరసింహ తదితరులు శనివారం ఏపీడీ సలీంబాషాకు వినతి పత్రం అందజేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడినట్లు నిరూపితమైతే ఫీల్డ్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆలూరు రూరల్: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ అల్లబకాష్ అన్నారు. శనివారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో చేపట్టిన జగనన్న ఇంటి నిర్మాణాలు హౌసింగ్ డీఈ ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. 93 మంది లబ్ధిదారులకు గాను ఇప్పటి వరకు 90 నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇందులో 13 ఇళ్లు 95 శాతం పూర్తయ్యాయని ఇందుకు సంబంధించిన ఫైనల్ బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. 77 ఇంటి నిర్మాణాలను థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు చెప్పారు.

నాడు-నేడు పనులు నాణ్యతగా చేయాలి

మొలగవల్లి గ్రామ జెడ్పీ పాఠశాలలో రూ.1.30 కోట్లతో చేపట్టిన పాఠశాల ఆధునికీకరణ పనులు నాణ్యతగా చేయాలని తహసీల్దార్ మల్లికార్జున చెప్పారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. వైస్ ఎంపీపీ శ్రీరాములు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, పీఎంసీ కమిటీ చైర్మన్ రామాంజినేయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఎమ్మిగనూరురూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో బంగారమ్మ పేర్కొన్నారు. శనివారం మాసుమాన్‌దొడ్డి గ్రామంలో జగనన్న కాలనీని ఆమె పరిశీలించి మాట్లాడారు. గృహ నిర్మాణాలు త్వరితగతిగా పూర్తి అయ్యేలా చూడాలని చెప్పారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ ఏఈ రామాంత్‌రా వు ఉన్నారు.



మొలగవల్లిలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్,ఎంపీడీఓ అల్లబకాష్

సత్వరమే బిల్లుల మంజూరు

చిప్పగిరి: గృహ నిర్మాణ బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీరాములు తెలిపారు. శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ రాజు, వెలుగు ఏపీయం నాగార్జునతో కలిసి కుందనగుర్తి గ్రామంలో పర్యటించారు. అక్కడ జగనన్న గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.

బాధిత కుటుంబాలకు భరోసా

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: నా అనే వారిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆర్థికసాయం చేసి భవిష్యత్‌పై భరోసా కల్పిస్తోంది. ఇందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వేదిక అవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పత్తికొండలో గడపగడపకు వెళ్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న 6 కుటుంబాలను గుర్తించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మొత్తం రూ. 10.32 లక్షల సాయం మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన చెక్కులను శనివారం ఎమ్మెల్యే బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సాయం పొందిన వారిలో రాజుల మందగిరికి చెందిన శ్రీరాములు (విద్యుదాఘాతం), నరేశ్‌కుమార్ (రోడ్డు ప్రమాదం), రామచంద్రాపురం కొట్టాలకు చెందిన ములకల గంగాధర్ (పాముకాటు), శ్రీరంగాపురానికి చెందిన ఊడల భానుమతి (పాముకాటు), దూదేకొండకు చెందిన తలారి రాజశేఖర్ (రోడ్డు ప్రమాదం), పందికోన బొగ్గుల శ్రీనివాసులు (అనారోగ్యం) కుటుంబ సభ్యులు ఉన్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలబడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రసవత్తరంగా గిరక బండి పందేలు

ఆస్పరి: అట్టికల్లు గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయి గిరక బండి పోటీలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య ప్రారంభించిన ఈ పోటీల్లో మొత్తం 22 జత ఎద్దులు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోరులో అనంతపురం జిల్లా పెంచలపాడు గ్రామానికి చెందిన రైతు రమేష్ వృషభాలు విజేతగా నిలిచి రూ. 20,116 బహుమతి గెలుచుకున్నాయి. అనంతపురం జిల్లా గడేకల్ రైతు గాదిలింగ ఎడ్లు రెండోస్థానంలో నిలిచి రూ. 15,116, అనంతపురం జిల్లా విడపనకల్లు గ్రామ రైతు చంద్రశేఖర్ ఎడ్లు మూడో స్థానంలో నిలిచి రూ. 10,116, ఆస్పరి మండలం వలగొండ గ్రామానికి చెందిన ఈరన్న ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచి రూ. 8,116, ఆస్పరి మండలం కారుమంచికి చెందిన ఆత్మానంద వృషభాలు ఐదోస్థానంలో నిలిచి రూ. 5,116, అనంతపురం జిల్లా లింగదహాల్ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి ఎడ్లు ఆరోస్థానంలో నిలిచి రూ. 3,116, పత్తికొండ మండలం పులికొండ గ్రామ రైతు రంగస్వామి నాయుడు ఎడ్లు ఏడో స్థానంలో నిలిచి రూ. 2,116, పత్తికొండ మండలం హోసూరుకు చెందిన విరకప్ప వృషభాలు ఎనిమిదో స్థానంలో నిలిచి రూ. 1,116 బహుమతి గెలుచుకున్నాయి. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు శివ, చాంద్‌బాషా, చిట్టి, వెంకటేష్, శ్రీను, రహిమాన్, రవి పాల్గొన్నారు.



గిరక బండి పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్రికెట్ విజేత కర్నూలు జట్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాత లాలుస్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. వారం రోజులుగా జరిగిన ఈ పోటీల్లో మొత్తం 30 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు రాజు, రంగడు, లాలు, గిరధర్ తెలిపారు. శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో చిట్యాలపై కర్నూలు జట్టు గెలుపొందింది. రెండో స్థానంలో చిట్యాల, తృతీయ స్థానంలో ఆలంకొండ జట్టు నిలిచిందన్నారు. గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో తాత దర్గా కమిటీ సభ్యులు వరుసగా రూ.15,016, రూ.10,016, రూ. 5,016 బహుమతిగా అందజేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

తుగ్గలి: మస్తానయ్యస్వామి ఉరుసు సందర్భంగా మారెళ్లలో శనివారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఇందులో రుద్రవరం రాముడు, ఎల్లాగౌడ్ వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాత స్థానాల్లో రంగాపురం చంద్రమోహన్‌రెడ్డి, గుడిపాడు వెంకటరామిరెడ్డి వృషభాలు, పందర్లపల్లి ఖలీల్‌బాషా వృషభాలు, ఐజ హార్మోన్ పెద్దయ్య, గద్వాల మేడికొండ వృషభాలు నిలిచాయి. వృషభ విజేతలకు వరుసగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్‌గౌడ్ రూ.20వేలు, శివసాయి డాబా రూ.15వేలు, అంబులదిన్నె కొత్తపల్లి నారాయణస్వామి రూ.10వేలు, మల్యాల షేక్ మైమున్నా రూ.5 వేలు నగదు అందజేశారు.



మారెళ్లలో రాతి దూలం లాగుతున్న వృషభాలు